## అగ్ని ప్రమాదాల నివారణకు సహకరించాలి



గంగాపూర్ ప్లాంటేషన్‌లో అవగాహన కల్పిస్తున్న మేనేజర్ సురేశ్‌కుమార్

రెబ్బెన, ఫిబ్రవరి 28 : అటవీ ప్రాంతం, ప్లాంటేషన్లలో అగ్ని ప్రమాదాల నివారణకు అందరూ సహకరించాలని ప్లాంటేషన్ ఇన్‌చార్జి మేనేజర్ సురేశ్ కుమార్ కోరారు. తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ కాగజ్‌నగర్ రేంజ్ పరిధిలోని రెబ్బెన మండలం గంగాపూర్ ప్లాంటేషన్‌లో శుక్రవారం అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్లాంటేషన్ల దగ్గర నుంచి వెళ్లేవారు సిగరేట్, బీడీలు, చుట్టలు తాగి నిర్లక్ష్యంగా పడేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో వాచర్‌లు వెంకటేశ్, గంగయ్య పాల్గొన్నారు.

## వివరాలు శాప్‌లో అప్‌లోడ్ చేయాలి

- టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 28 : సింగరేణి వ్యాప్తంగా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల వివరాలను వెంటనే శాప్‌లో అప్‌లోడ్ చేయాలని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కే సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఫొటోలు, ఆధార్ కార్డులతో సహా ఇప్పటికే రెండుసార్లు గనులు, డిపార్ట్‌మెంట్ల పర్సనల్ అధికారులకు ఇచ్చినా సగం మంది వివరాలను అప్‌లోడ్ చేయకపోవడం శోచనీయమన్నారు. దీంతో సింగరేణి దవాఖాన నుంచి అత్యవసర చికిత్స కోసం రెఫరల్ ద్వారా కార్పొరేట్ దవాఖానకు పంపలేని పరిస్థితి నెలకొంటున్నదని పేర్కొన్నారు. దవాఖానలకు వెళ్లిన వారి వివరాలు (ఫొటోలు) శాప్‌లో లేకపోవడంతో యాజమాన్యం ఇటీవల ఇచ్చిన సర్క్యులర్ ప్రకారం తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. వెంటనే యాజమాన్యం ఆయా గనులు, డిపార్ట్‌మెంట్ల ఉద్యోగులు ఇచ్చిన వివరాలు, వారి కుటుంబ సభ్యుల వివరాలు అప్‌లోడ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే యాజమాన్యం వెంటనే పెరిగిన సాంకేతిక వైద్య పరిజ్ఞానాన్ని దృష్టిలో పెట్టుకొని నిమ్స్ టారీఫ్ బిల్లులను సవరించి కార్పొరేట్ దవాఖానలకు ఆదేశాలు పంపించాలన్నారు. సింగరేణి ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులను ఆర్థిక దోపిడీకి గురికాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ బండి రమేశ్, కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పొగాకు రమేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అన్వేష్ రెడ్డి పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 28 : ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్ కార్యాలయంలో ఆర్ఐ మురళికి వినతిపత్రం సమర్పించారు. గ్యారెంటీల అమలుకు కావాల్సిన నిధులను ఈ బడ్జెట్ సమావేశాల్లో కేటాయించాలన్నారు. ఈ మేరకు రూ.100 కోట్ల ఆస్తిపై బడిన వారందరికీ ప్రజా సంక్షేమ టాక్స్ అమలు చేయాలని పేర్కొన్నారు. విద్య, వైద్యం, మహిళ, యువజన సంక్షేమ రంగాలకు 40 శాతం నిధులు కేటాయించాలన్నారు. మిర్చి రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధరతో పాటు, బోనస్ ప్రకటించి, కొనుగోలు చేయాలని కోరారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించి, ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను 6 నెలల్లో పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఆరెపల్లి రమేశ్, మండల కార్యదర్శి ఆరెపల్లి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## టీఎన్జీవో ఉద్యోగుల సంఘ సమావేశం

హాజీపూర్, ఫిబ్రవరి 28 : తెలంగాణ నాన్ గెజిటెడ్ (టీఎన్జీవో) ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహ నిర్మాణ సంఘం లిమిటెడ్ మంచిర్యాల జిల్లా సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు గడియారం శ్రీహరి అధ్యక్షతన నిర్వహించారు. సొసైటీ ఫేజ్-1,2లో అంతర్గత సీసీ రోడ్లు, సైడ్ డ్రైయిన్ల నిర్మాణంతో పాటు, అవసరమైన చోట విద్యుత్ స్థంభాలను ఏర్పాటు చేయాలన్నారు. ఫేజ్-2లో 11 కేవీ టవర్ వైర్లను తొలగించడం, ఫేజ్-3లోని టవర్‌ను తొలగించి వేరే చోట ఏర్పాటు చేయడంతో పాటు, అర్హులైన వారికి ఫ్లాట్ వచ్చి పొజిషన్‌లో లేని వారికి కోర్టు కేసులు క్లియర్ కాగానే ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానాలను చేసినట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి హబీబ్ హుస్సేన్, ఉపాధ్యక్షుడు సైండ్ల మొండయ్య, సంయుక్త కార్యదర్శి భూముల రామ్మోహన్, కోశాధికారి రాజమౌళి, కార్యవర్గ సభ్యులు గోపాల్, కళావతి, ఏవీఆర్‌డీ ప్రసాద్ రావు, సయ్యద్ ఇంతియాజ్ అహ్మద్, లీగల్ అడ్వైజర్స్ పుప్పాల హన్మంతరావు, సంగర్స్ సంతోష్, రమేశ్, తిరుపతి రెడ్డి, సలహాదారులు శ్రీపతి బాపురావు, పొన్న మల్లయ్య, గోవింద రెడ్డి, లలిత, సునీత, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పది



తాండూర్ ఎమ్మార్సీ కార్యాలయంలో ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎంపీడీవో, ఎంఈవో, ఉపాధ్యాయులు

తాండూర్, ఫిబ్రవరి 28 : సమాజంలో ఉపాధ్యాయులు పాత్ర గొప్పదని ఎంపీడీవో పీ శ్రీనివాస్ అన్నారు. అచ్చలపూర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ఇందూరి ఆశాలు విరమణ పొందగా, ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవో ఎస్ మల్లేశం ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి శేష జీవితం గడుపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొరెపల్లి, బోయపల్లి పాఠశాలల హెచ్‌ఎంలు మాసాడి శ్రీరాములు, మధుసూదన్, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే తాండూర్ లైబ్రేరియన్ గజ్జెల రమేశ్ విరమణ పొందగా, లైబ్రరీ ఆవరణలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆయనను జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎస్ మహేందర్‌రావు, ఎంపీడీవో శ్రీనివాస్, ఎండీ ఈసా సన్మానించారు. నాయకులు దత్తాత్రేయరావు, ఎలుక రాంచందర్, ప్రభాకర్, సదానందం, లైబ్రరీ సిబ్బంది, పాఠకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

కౌటాల, ఫిబ్రవరి 28 : కౌటాల జడ్పీ పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు కే సత్యనారాయణ విరమణ పొందగా, పాఠశాలలో ఘనంగా వీడ్కోలు పలికారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. విద్యార్థులు బ్యాండ్ మేళాలతో పాఠశాల నుంచి బస్టాండ్ వరకు సాగనంపారు. పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆరోగ్యంపై అవగాహన

వాంకిడి, ఫిబ్రవరి 28 : లక్ష్మీపూర్ జీపీ పరిధి పగిడిగూడ గిరిజన గ్రామ ప్రజలకు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ శుక్రవారం అవగాహక కల్పించారు. గ్రామంలోని ఇంటి పరిసరాల్లో దోమలమందు పిచికారీ చేయించారు. అనంతరం వైద్యశిబిరం నిర్వహించి, 34 మందికి పరీక్షలు చేశారు. జ్వరంతో ఉన్న ఇద్దరి రక్తానమూనాలు సేకరించి, మందులు పంపిణీ చేశారు. హెల్త్ అసిస్టెంట్లు పుష్ప, భగవాన్ దాస్, ఆశ కార్యకర్త కమల పాల్గొన్నారు.

## కుట్టు శిక్షణ సర్టిఫికెట్ల పంపిణీ

కాసిపేట, ఫిబ్రవరి 28 : సోమగూడెం భరత్ కాలనీ గ్రామంలో జోసఫ్ షారోన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టు శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. 23 మంది మహిళలకు న్యూ జేరుషలేము చర్చి పాస్టర్ చెన్నూరి రామకృష్ణ, స్వర్ణ చేతుల మీదుగా అందించారు. కుట్టు శిక్షణోపాధ్యాయురాలు ఎండీ అష్రఫ్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

# నత్తనడకన అండర్ బ్రిడ్జి నిర్మాణం

*మందమర్రి రైల్వే స్టేషన్ సమీపంలో నార్లాపూర్ గ్రామం వద్ద చేపట్టిన అండర్ బ్రిడ్జి నిర్మాణం నత్తనడకన సాగుతున్నది. పనులు ప్రారంభించి రెండేళ్లు కావస్తున్నా అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ అలసత్వంతో సగానికిపైగా పెండింగ్‌లోనే మూలుగుతున్నది. దశాబ్దాల కల సాకారమవుతుందని, ప్రయాణ కష్టాలు తీరుతాయనుకున్న మందమర్రి మున్సిపాలిటీ పరిధి నార్లాపూర్, ఊరు రామకృష్ణాపూర్‌వాసులకు నిరాశే మిగులుతున్నది.* - మందమర్రి, ఫిబ్రవరి 28

- అధికారుల నిర్లక్ష్యం.., కాంట్రాక్టర్ అలసత్వం
- రెండేళ్లు కావస్తున్నా పూర్తికాని వైనం
- అవస్థలు పడుతున్న నార్లాపూర్, ఊరు రామకృష్ణాపూర్ ప్రజానీకం



కొనసాగుతున్న అండర్ బ్రిడ్జ్ నిర్మాణం పనులు

మందమర్రి పట్టణానికి నార్లాపూర్ ప్రజలు రావాలంటే మధ్యలో జాతీయ రైల్వే లైన్ అడ్డుగా ఉంటుంది. ఈ లైన్ నుంచి తరచూ వివిధ రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో రైల్వే సిబ్బంది నార్లాపూర్ సమీపంలో గల రైల్వే గేటు తరచూ వేయడంతో ఈ దారి గుం డా ప్రయాణించే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితి. ఒక్కోసారి గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తున్నది. అసహనానికి గురైన సంఘటలు ఎన్నో ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలో ఉన్నప్పటికీ గ్రామీణ వాతావరణం కలిగిన నార్లాపూర్, ఊరు రామకృష్ణాపూర్ నుంచి పాలు, కూరగాయల వ్యాపారాలతో పాటు వందలాది మంది ప్రజలు నిత్యం అవసరాల నిమిత్తం మందమర్రి పట్టణానికి వస్తుంటారు. ఈ మార్గమధ్యలో గల రైల్వే గేటు తీవ్ర అంతరాయంగా మారడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. రైల్వే గేట్ మరమ్మతులు, అత్యవసర సమయంలో అందుగులపేట వద్ద జాతీయ రహదారిపై పాతబస్టాండ్ ఏరియా మీదుగా ప్రయాణం సాగించాల్సిన దుస్థితి. మందమర్రి పట్టణానికి చెందిన ప్రజలు కూడా వివిధ అవసరాలపై నార్లాపూర్ వెళ్లాలంటే గేట్ దాటి వెళ్లాల్సిందే. ఆయా ప్రాంతాల ప్రజలు రైల్వేగేట్ స్థానంలో అండర్ బ్రిడ్జి నిర్మించాలని దశాబ్దాలుగా కోరుతున్నారు. అయినా ఉమ్మడి పాలనలో అటు పాలకులు, అధికారులు ఎవరూ పట్టించుకోలేదు. ప్రజల కష్టాలను గుర్తించిన చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్, పెద్దపల్లి మాజీ ఎంపీ బోర్లకుంట వెంకటేశ్‌నేతతో కలసి కేంద్రంపై ఒత్తిడి చేసి అండర్ బ్రిడ్జిని మంజూరు చేయించారు. దీంతో నార్లాపూర్ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణానికి సుమారు రూ.6 కోట్ల నిధులను మంజూరు చేసిన రైల్వే శాఖ.. అలం కన్‌స్ట్రక్షన్ కంపెనీకి బాధ్యతలను అప్పగించింది. 2023, మే నెలలో పనులను ప్రారంభించినా అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ అలసత్వంతో పనులు నత్తనడకన సాగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. తమ కష్టాలను గుర్తించి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కోరుతున్నారు.



మందమర్రి వైపు తవ్వి వదిలేసిన పనులు



రైల్వే గేట్ వద్ద వేచి ఉన్న వాహనదారులు

## అటవీ భూముల రక్షణ అందరి బాధ్యత



ఖైర్‌గూడ ఓసీపీ డంప్ పరిశీలిస్తున్న సింగరేణి అటవీశాఖ సలహాదారు మోహన్ పరిగన్, జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్

రెబ్బెన, ఫిబ్రవరి 28 : అటవీ భూముల పరిరక్షణ బాధ్యత అందరిపైనా ఉన్నదని సింగరేణి అటవీశాఖ సలహాదారు మోహన్ పరిగన్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ పేర్కొన్నారు. బెల్లంపల్లి ఏరియాలో శుక్రవారం వారు పర్యటించారు. ఖైర్‌గూడ ఓసీపీలోని డీ1, డీ2, డీ3 డంప్‌లను, వాటిపై నాటిన మొక్కలు, ఎదిగిన వృక్షాలను పరిశీలించారు. అటవీశాఖ అనుమతులు పొందిన భూముల్లో చేపట్టిన పనులు, నిర్మాణాలను పరిశీలించారు. ఖైర్‌గూడ ఓసీపీ పనులు పరిశీలించిన అనంతరం, పలు సలహాలు, సూచనలు చేశారు. ఖైర్‌గూడ పీవో మచ్చగిరి నరేందర్, ఏరియా ఎస్‌వోటూ జీఎం రాజమల్లు, బీపీఏ ఓసీపీ టూ మేనేజర్ మహేశ్‌కుమార్ పాల్గొన్నారు.

## హడ్‌హక్ కమిటీల ఎన్నిక

బెల్లంపల్లి, ఫిబ్రవరి 28 : తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి నియోజకవర్గ, పట్టణ హడ్‌హక్ కమిటీలను ఎన్నుకున్నారు. సీపీఐ కార్యాలయంలో శుక్రవారం జిల్లా కార్యదర్శి జాడి పోశం ఆధ్వర్యంలో నియోజకవర్గ కో కన్వీనర్‌గా కొంకుల రాజేశ్, పట్టణ కన్వీనర్‌గా ఆవునూరి రాజయ్య, కో కన్వీనర్‌గా చిప్పకుర్తి బాపు, కో కన్వీనర్‌గా రామగిరి వెంకటి ఎన్నికయ్యారు. సీపీఐ పట్టణ కార్యదర్శి ఆడేపు రాజమౌళి, మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి దేవి పోశన్న, నాయకులు రత్నం రాజం, మామిడి గోపి, సభ్యులు కంపెల్లి నారాయణ, దేవునూరి కిషన్, లింగంపల్లి రాజలింగం పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగికి విరమణ సహజం



వసంత్ కుమార్ దంపతులను సన్మానిస్తున్న డీపీఆర్వో సంపత్

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 28 : ప్రభుత్వ ఉద్యోగికి విరమణ సహజమని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి సంపత్ అన్నారు. డీపీఆర్వో కార్యాలయంలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన వసంత కుమార్ దంపతులను జర్నలిస్టులతో కలిసి ఘనంగా సన్మానించారు. వసంత కుమార్ విభాగానికి ఎంతో సేవ చేశారని కొనియాడారు. ఉద్యోగంలో ఉన్నప్పుడు మనం చేసిన సేవ కార్యక్రమాలు తర్వాత జీవితంలో ప్రజలకు గుర్తుండిపోతాయన్నారు. కార్యాలయ సిబ్బంది రమేశ్, పాషా, వెంకటేశ్, శ్రీనివాస్, జర్నలిస్టులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

### హెడ్ కానిస్టేబుల్‌కు..

జిల్లాలో హెడ్ కానిస్టేబుల్‌గా విరమణ పొందుతున్న జగ్గారావు దంపతులను ఏఎస్పీ ప్రభాకర్ రావు ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. డీసీఆర్బీ డీఎస్పీ కరుణాకర్, జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షుడు విజయ శంకర్ రెడ్డి, ఎంటీవోఆర్ఐ అంజన్న, డీపీవో ఏవో శ్రీనివాస్ రెడ్డి, పోలీస్ సంఘం వైస్ ప్రెసిడెంట్ స్వామి, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### అసిస్టెంట్ డైరెక్టర్‌కు..

జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించి విరమణ పొందిన గమినియల్ దంపతులకు జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో డీఈవో యాదయ్యతో పాటు, పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాసరావు నాయకులు సునీల్ కుమార్ జిల్లా పరీక్షల సహాయ సంచాలకుడు ఉదయ బాబు, ఎఫ్‌ఏవో దేవాజీ, ఎంఈవో సుభాష్ పాల్గొన్నారు.

## విరమణ ఉద్యోగులకు ఆత్మీయ సన్మానాలు



శ్రీరాంపూర్ : వర్క్‌షాప్‌లో ఎలక్ట్రికల్ ఫోర్‌మన్ రవీందర్ దంపతులను సన్మానిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 28 : శ్రీరాంపూర్ ఏరియా గనులు, డిపార్ట్‌మెంటుల్లో పనిచేసి, విరమణ పొందిన ఉద్యోగులను శుక్రవారం అధికారులు, నాయకులు ఘనంగా సన్మానించారు. శ్రీరాంపూర్ వర్క్‌షాప్‌లో విరమణ పొందిన ఎలక్ట్రికల్ ఫోర్‌మన్ ఒల్లాల రవీందర్, ఎలక్ట్రీషియన్ పాండుమోహన్‌ను డీవైజీఎం రవీందర్ సత్కరించారు. అలాగే ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి సదానందం, ఈఈ రాకేశ్, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కే సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పొగాకు రమేశ్, ఆర్గనైజర్ అన్వేష్‌రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫోర్‌మన్లు బ్రహ్మచారి మోహన్, మహేశ్‌రాజు, హుస్సేన్ పాల్గొన్నారు. శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్‌లో జనరల్ మజ్దూర్‌గా విరమణ పొందిన గుమాస లక్ష్మిని జీఎం ఎం శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. ఏఐటీయూసీ డిప్యూటి ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి సన్మానించారు. అనంతరం సంస్థ నుంచి లభించిన టర్మినల్ బెనిఫిట్ చెక్కులను అందించారు. ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, డీవైజీఎం అరవిందరావు, లైజన్ ఆఫీసర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే శ్రీరాంపూర్ ఆర్కే 6గనిలో విరమణ పొందిన ఎండపల్లి ముత్య, భూక్యా భీమ్‌నాయక్, దుండ్రు అంజయ్య, ముల్కల్ల అప్పయ్య, పానుగంటి రాజయలింగును మేనేజర్ తిరుపతి, ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పొగాకు రమేశ్ ఘణంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ ఆఫీసర్ కాదాసి శ్రీనివాస్, డిప్యూటీ మేనేజర్ కొమురయ్య, ఈఈ శ్యాంకుమార్, సీనియర్ పీవో సురేందర్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి, ఫిబ్రవరి 28 : మందమర్రి ఏరియాలోని శాంతిఖని గనికి చెందిన పంప్ ఆపరేటర్ పుప్పిరెడ్డి మల్లయ్య, ఫ్యాన్ ఆపరేటర్ దుర్గం దుర్గయ్య విరమణ పొందగా, గని ఆవరణలో గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా సన్మానించారు. రక్షణాధికారి పీ రాజు, సంక్షేమాధికారి రవికుమార్, నాయకులు దాసరి తిరుపతి గౌడ్, అక్బర్ అలీ, అధికారులు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రెబ్బెన, ఫిబ్రవరి 28 : బెల్లంపల్లి ఏరియా గోలేటి జీఎం కార్యాలయంలో ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, ఎంవీటీసీ మేనేజర్ విజయ్‌సింగ్ ఇందా విరమణ పొందగా, జీఎం విజయభాస్కర్‌రెడ్డి సన్మానించారు. ఏరియా ఎస్‌వోటూ జీఎం రాజమల్లు, ఏరియా ఇంజినీర్ రామనాథం, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

జైపూర్, ఫిబ్రవరి 28 : ఎస్టీపీపీలో ఏజీఎం ఫైనాన్స్‌గా విధులు నిర్వహించి విరమణ పొందుతున్న సుధాకర్‌ను అడ్మిన్ కార్యాలయంలో జీఎం శ్రీనివాసులు, తోటి అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో చీఫ్‌ఆఫ్ ఓఅండ్ఎం జైన్‌సింగ్, ఏజీఎం సివిల్ ప్రసాద్, ఏజీఎం మధన్‌మోహన్, ఏజీఎం ఫైనాన్స్ చక్రవర్తి, సీనియర్ పర్సనల్ అధికారి ఠాకూర్ మోహన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



బెల్లంపల్లి : విరమణ పొందిన కార్మికులతో శాంతిఖని గని అధికారులు

మందమర్రి, ఫిబ్రవరి 28 : మందమర్రి ఏరియా జీఎం కార్యాలయంలో పని చేసి విరమణ పొందిన అసిస్టెంట్ సూపరింటెండెంట్ ముప్పిరి మధుసూదన్ రావు దంపతులు, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ జనరల్ మజ్దూర్ గుజ్జా చందర్ దంపతులను స్థానిక ఎల్లందు క్లబ్‌లో జీఎం దేవేందర్ ఏరియా అధికారులతో కలసి సన్మానించారు. అలాగే కేకే గ్రూప్ ఏజెంట్‌గా సేవలందించి ఉద్యోగోన్నతిపై కార్పొరేట్‌కు వెళ్తున్న రాందాస్‌ను జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో జీఎం దేవేందర్, అధికారులు సన్మానించారు. ఎస్‌వోటూ జీఎం విజయ్ ప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఇన్‌చార్జి పర్సనల్ మేనేజర్ కే మైత్రేయబంధు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.



రెబ్బెన : విరమణ పొందిన అధికారులతో ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి



జైపూర్ : ఎస్టీపీపీలో విరమణ డీజీఎంను సన్మానిస్తున్న జీఎం శ్రీనివాసులు



మందమర్రి : జీఎం ఆఫీస్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ మధుసూదన్ దంపతులను సన్మానిస్తున్న జీఎం, అధికారులు

## అనుమానాస్పదంగా యువకుడి మృతి



నస్పూరి వినయ్(ఫైల్)

మంచిర్యాల అర్బన్, ఫిబ్రవరి 28 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని హమాలివాడ గేట్, ఫ్లై ఓవర్ మధ్యలో గల రైల్వే ట్రాక్ వద్ద మందమర్రి బస్టాండ్ రామన్ కాలనీకి చెందిన నస్పూరి వినయ్ (30) రైలు కిందపడి అనుమానాస్పదంగా మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్ఐ మహేందర్ శుక్రవారం తెలిపారు. వినయ్ సింగరేణి సంస్థలో ప్రైవేట్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడని పేర్కొన్నారు. మృతికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. వినయ్‌కి భార్య భాగ్యలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని ప్రస్తు తం మంచిర్యాల ప్రభుత్వ దవాఖా మార్చురీ గదికి తరలించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు పేర్కొన్నారు.

## నలుగురిపై కేసు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 28 : మండలంలోని చర్లపల్లి గ్రామానికి చెందిన బొలెరో వాహన డ్రైవర్ దుర్గం మహేందర్‌పై దాడికి పాల్పడిన దుర్గం సన్నీ, దుర్గం సాయి, కోట బానేష్ మరో వ్యక్తిపై శుక్రవాం కేసు నమోదు చేసినట్లు తాళ్లగురిజాల ఎస్ఐ రమేశ్ తెలిపారు. స్థలం విషయంలో వివాదం ఉండడంతో అదే గ్రామానికి ఈ నలుగురు దాడి చేసినట్లు పేర్కొన్నారు. సన్నీ కత్తితో పొడువగా, మహేందర్ పొట్ట భాగంలో గాయమైందని తెలిపారు. మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించి, మెరుగైన వైద్యం కోసం ఎంజీఎం తరలించినట్లు పేర్కొన్నారు. మహేందర్ తల్లి యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

## ఇసుక నిల్వల స్వాధీనం

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 28 : మందమర్రి మండలంలోని పులిమడుగు గ్రామంలో అక్రమంగా నిల్వచేసిన ఇసుకను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు రామకృష్ణాపూర్ ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు శుక్రవారం తనిఖీలు చేపట్టగా, అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 40 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక నిల్వలు గుర్తించినట్లు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకొని రెవెన్యూ అధికారులకు సుమారు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. పంచనామా నిర్వహించి సదరు యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## పేకాట రాయుళ్ల అరెస్ట్

జన్నారం, ఫిబ్రవరి 28 : మండలంలోని రేండ్లగూడలో పేకాటాడుతున్న నలుగురిని పట్టుకున్నట్లు, మరో ఇద్దరు పారిపోయినట్లు ఎస్ఐ రాజవర్ధన్ శుక్రవారం తెలిపారు. తనిఖీలో భాగంగా అదేగ్రామానికి చెందిన వెయిగండ్ల లక్ష్మణ్‌చారి, వెయిగండ్ల రవి, వెయిగండ్ల రాజశేఖర్, అల్లం మల్లయ్యను పటుటకోగా, తిరుపతి, దస్తగిరి పారిపోయారని పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## 8న ఫుడ్ ఫెస్టివల్

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 28 : జిల్లా మహిళా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య భవన్‌లో 8వ తేదీన ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు ప్రధాన కార్యదర్శి నరేందుల సాహితి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న మహిళా దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఫుడ్ ఫెస్టివల్‌లో పోషకాహార గుణాలు ఉండేలా అతి తక్కువ ఖర్చుతో అతి తక్కువ నూనె వాడకంతో ప్రోటీన్లు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు తయారు చేసే వారికి అత్యంత ప్రాధాన్యమిస్తామని తెలిపారు.

## వీడ్కోలు సమావేశం

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 28 : లక్షెట్టిపేట పట్టణంలోని వాగేశ్వరి కళాశాల సీనియర్ విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం వీడ్కోలు వేడుక ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపల్ అప్పని లక్ష్మణ్, డైరెక్టర్లు పుప్పిరెడ్డి శ్రీధర్ రెడ్డి, వెన్నంపెల్లి మహేందర్, గాదాసు సాగర్, గడిగొప్పుల శ్రీనివాస్, గుజ్జేటి నరేశ్, చంద వెంకటరమణ, చిలుకూరి వంశీ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా బర్డ్ ఫెస్టివల్

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 28 : లక్షెట్టిపేట రేంజ్ పరిధిలోని వెంకట్రావుపేట చెరువు వద్ద శుక్రవారం బర్డ్స్ ఎక్సపర్ట్ అధికారులు, రేంజ్ అధికారి సుభాష్, వైష్ణవి ఉమెన్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. వివిధ రకాల పక్షులను తిలకించారు. ప్రిన్సిపాల్ ఆకుల కిరణ్ కుమార్, ఎఫ్‌బీవో సత్తయ్య, కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చర్యలు తీసుకోవాలి

మంచిర్యాల (ఏసీసీ), ఫిబ్రవరి 28 : ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా గురువారం కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య జరిగిన గొడవ వద్దకు వెళ్లిన బీసీ పోలీసు అధికారి విధులకు ఆటంకం కల్గించడంతో పాటు, ఇబ్బందులకు గురిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నిరసన చేపట్టారు. బీసీ అధికారి విధులకు ఆటంకం కలిగించడం సరికాదన్నారు. వారిపై తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జాతీయ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, శాఖపూరి భీంసేన్, రాజకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సీసీసీ నస్పూర్, ఫిబ్రవరి 28 : నస్పూర్‌లోని 33/11కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారి శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## 4న మహిళలకు ఆటల పోటీలు

మందమర్రి, ఫిబ్రవరి 28 : మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని మందమర్రి ఏరియాలోని సీఈఆర్ క్లబ్‌లో 4వ తేదీన మహిళలకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు 8న మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఏరియాలోని సింగరేణి ఉద్యోగుల కుటుంబ సభ్యులతో పాటు, మహిళా ఉద్యోగులు, పరిసర గ్రామాల మహిళలు పాల్గొనాలని కోరారు.

## న్యాయం చేయాలి

మందమర్రి, ఫిబ్రవరి 28 : ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వెనుకబడిన నేతకాని మహర్ కులానికి న్యాయం చేయాలని ఆ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సునార్కర్ రాంబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి గంగాధర్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కామెర అనూష కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమీషన్ చైర్మన్ డాక్టర్ షమీమ్ అక్తర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. వర్గీకరణ గ్రూపు 1,2,3కి బదులుగా ఏబీసీడీలను ఏర్పాటు చేసి నేతకానీలను సీ గ్రూపులో చేర్చాలన్నారు. యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం సంతోష్, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జుమ్మిడి గోపాల్ పాల్గొన్నారు.